సాక్షి
నిర్మల్

శుక్రవారం । 23 । జూన్ । 2023



ఆర్టీసీ ప్రయాణం.. పాస్

విద్యార్థులకు ఉచిత రాయితీ పాస్‌లు అందించేం దుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. పాసుల కోసం https://online.tsrtcpass.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు.

8లో▸

నిరాశను మిగిల్చిన 'గృహలక్ష్మి'

నిర్మల్‌చైన్‌గేట్: గృహలక్ష్మి పథకం మార్గదర్శ కాలు నిరాశను మిగిల్చాయని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ నాయకుడు దుర్గం నూతన్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. వాస్తవాలను పరిశీలించి దానికి అనుగు ణంగా మార్గదర్శకాలను సవరించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలంద రికీ 125 గజాల స్థలం ఇచ్చి పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణో గ్రతలు గణనీయంగా తగ్గుతాయి. జిల్లాలో అక్క డక్కడా వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎం, వీవీప్యాడ్‌ల పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: సమీకృత కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంలో జరుగుతున్న ఈవీఎం , వీవీప్యాడ్ మిషిన్ల మొదటి విడత చెకింగ్ పను లను గురువారం అదనపు కలెక్టర్ రాంబాబు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదే శాల మేరకు ఈ నెల 22 నుండి వచ్చే జూలై 4 వరకు ఐదు వేల మిషిన్లను చెక్ చేయడం జరు గుతుందన్నారు. రెవెన్యూ, పోలీస్, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రమేశ్, మజార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు లీగల్ ఎయిడ్ సర్వీసెస్ ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో న్యాయపరమైన సహాయం కొరకు శుక్రవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ సర్వీసెస్‌ను ప్రారం భిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకు మార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉదయం 9:30 గంటలకు వర్చువల్‌గా హైకోర్టు ప్రధాన చీఫ్ జస్టిస్ ఉజ్జల్ బుయన్, హైకోర్టు జడ్జి నవీన్ రావు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. లీగల్ ఎయిడ్ సర్వీసెస్ ద్వారా ప్రజలు ఉచితం గా న్యాయ సహాయం పొందవచ్చన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలు



బాసరలో పూజలు చేస్తున్న ఆలయ ఈవో

భైంసా(ముధోల్): తెలంగాణ రాష్ట్రం సుభిక్షం గా ఉండాలని వేడుకుంటూ గురువారం బాసర సరస్వతీ అమ్మవారికి పూజలు చేశారు. తెలం గాణ దశాబ్ది ఉత్సవాల్లో చివరి రోజు ఆలయ ఈవో విజయరామారావు, శరత్‌పాఠక్‌తో పా టు పలువురు అమ్మవారిని వేడుకున్నారు. రాష్ట్ర మంతా మంచి వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ఈ ప్రాంతం సుభిక్షంగా ఉం డాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- బీజేపీ నాయకులు రావుల రాంనాథ్



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాల నలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీకి ఓటేయాలని పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్ చార్జి రావుల రాంనాథ్ కోరారు. మహాజన సం పూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం తొమ్మిదేళ్లలో వివిధ రూపాల్లో రాష్ట్రం అభివృద్ధికి రూ.5 లక్షల కోట్లు ఇస్తే బీఆర్ఎస్ రూ.5 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చిందన్నారు. రెండు పార్టీలకు తేడా ఇక్కడే అర్థమవుతోంద న్నారు. బీజేపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ ఓర్వలేక బీఆర్ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, పోలింగ్ బూత్ అధ్యక్షులు ఎస్పీ రమేశ్, అల్లం అరుణ్, మగ్గిడి సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌లెస్



జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యం లో రిజిస్టర్ అయిన స్కూల్ బస్సులు 224 ఉన్నాయి. ఒక్కో బస్ ఫిట్‌నెస్ పరీక్షకు సంవత్సరానికి ఒకసారి రూ.5వే లు ఖర్చవుతుంది. ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తాయి. ఈ లెక్కన ఒక బస్ సీటింగ్ కెపాసిటీ ఆధారంగా 40 మందికి నెలకు రూ.40 వేలు వసూలు చేస్తారు. కానీ జిల్లా వ్యాప్తంగా 85 బస్సులు ఇప్పటివ రకు ఫిట్‌నెస్ చేయించుకోకుండా వారి స్వలాభం కోసం అలాగే నడుపుతు న్నారు. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేసే స్కూలు యాజమాన్యాలు కేవలం ఫిట్‌నె స్ కోసం రూ.5 వేలు ఖర్చు చేయడానికి వెనుకాడుతున్నాయి.

- జిల్లాలో 224 ప్రైవేట్ స్కూల్ బస్సులు
- ఫిట్‌నెస్ పూర్తయినవి 139
- జూన్ 12తోనే ముగిసిన గడువు
- ఒక్కో వాహనానికి రూ.వేలల్లో వసూలు
- ఆర్టీఏ కార్యాలయంలో దళారుల దందా

నిర్మల్‌చైన్‌గేట్: విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే విద్యార్థులను తరలించే వాహనాలకు యా జమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. కానీ పాఠశాలలు ప్రారంభమై పది రోజులు కావస్తున్నా యాజమాన్యాలు ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ నెల 12 వరకు అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచించారు. అయినా కొన్ని విద్యాసం స్థల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు చెందిన బస్సులు 224 ఉండగా ఈ నెల 22 వరకు 139 బస్సులకు మాత్ర మే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఇంకా 85 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంది.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

జిల్లాలోని 208 ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 35 వేలకు పైబడి విద్యార్థులు చదువుతున్నారు. పిల్లల ను పాఠశాలల నుంచి తీసువెళ్లి, తిరిగి ఇళ్లకు చేర్చేం దుకు అవసరమైన ప్రైవేట్ పాఠశాలల బస్సుల నిర్వ హణ ప్రశ్నార్థకంగా మారింది. వేలకు వేలు ఫీజులు గుంజుతున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫిట్‌నె స్ లేని వాహనాలను నడుపుతూ విద్యార్థుల ప్రా ణాలతో చెలగాటమాడుతున్నాయి. జిల్లాలో 224 బ స్సులు ఉండగా 139 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పొందినట్లు సంబంధిత అధికారులు తెలి పారు. పలు ప్రాంతాల్లో కళ్లముందే ప్రమాదాలు కని పిస్తున్నప్పటికీ అటు అధికారులు, ఇటు యాజమా న్యాలు మాత్రం నిర్లక్ష్యం వీడడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొనసాగుతున్న దళారుల దందా...

అమ్మానాన్నలకు బైబై చెప్పి బడికి బయలుదేరుతు న్న చిన్నారులను భద్రంగా గమ్యస్థానాలకు తీసుకెళ్లా ల్సిన బాధ్యత ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలది. ఈ బస్సులకు 'ఫిట్‌నెస్' జారీ చేయాల్సిన రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఆర్టీఏ) కార్యాలయాల్లో దళా రుల దందా జోరుగా సాగుతోంది. ఒక్కో వాహ నానికి వేలల్లో మామూళ్లు ఇస్తేనే సర్టిఫికెట్ జారీ అవుతోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. తాము అధికారు లకు కమీషన్లు ముట్టజెప్పాల్సి వస్తోందని దళారులు బాహాటంగానే చెబుతున్నారు. చేతులు తడిపిన యా జమాన్యాల వాహనాలకు సర్టిఫికెట్లు జారీచేస్తుండ గా కరోనా కష్టాల నుంచి ఇంకా కోలుకోని కొన్ని స్కూల్ యాజమాన్యాలు ఏజెంట్లు అడిగినంత ఇవ్వ లేక అవస్థలు పడుతున్నాయి. ఫలితంగా బడులు ప్రారంభమైనా ఇప్పటివరకు 85 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ కాకపోవడం గమనార్హం.

తనిఖీల జాడేది?

విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి 11 రోజులు గడుస్తున్నా ఆర్టీఏ అధికారులు మాత్రం తనిఖీలు నిర్వహించడం లేదు. దీంతో కొన్ని ప్రైవేట్ పాఠశా లల యాజమాన్యాలు బస్సులను ఎటువంటి ఫిట్‌నె స్ లేకుండానే యథేచ్ఛగా తిప్పుతున్నాయి. అను కోని సంఘటన ఏదైనా జరిగితే దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలను కుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలకు సంబంధించిన వివరాలు, డిజిగ్నేషన్, సెల్ నంబర్, బస్సు మోడల్, డ్రైవర్ వివరాలు, అటెండెంట్, ఫొటోలు, బస్సు నడిచే మార్గం, సీట్ల పరిమితి, తదితర విషయాలను నమోదు చేయాలి. ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా వాహనంలో మెడికల్ కిట్లు, గాలి, వెలుతురు వచ్చేలా కిటి కీలు, సీట్ల మధ్య రాడ్లు అమర్చి ఉండాలి. విద్యార్థులు బస్సులో ఎక్కేందుకు, దిగేందుకు అనుకులంగా 325 మి.మీ ఎత్తు ఉండేలా బస్సు మెట్లు ఉండాలి.

- ఆపద సమయంలో బయటకు దిగేందుకు అత్యవసర ద్వారం తప్పకుండా ఏర్పాటు చేసి ఉండాలి.
- విద్యార్థులు బస్సు దిగేటప్పుడు, ఎక్కే టప్పుడు డ్రైవర్‌కు కనబడేలా రెండు వైపు లా సైడ్ అద్దాలు, అన్ని కిటికీలను కలుపుతూ ఇనుప జాలి అమర్చి ఉండాలి.
- వాహనం టైర్లు, బ్రేక్‌లు నాణ్యతతో ఉండే లా చూసుకోవాలి. బస్సుపై ఏ పాఠశా లకు చెందిందో తెలిపేలా పూర్తి వివరాలు రాసి ఉంచాలి.
- పాఠశాల వాహనాలు నడిపే డ్రైవర్లకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వ హించాలి.
- రాత్రి వేళల్లో బస్సులను గుర్తుపట్టేలా నాలుగు వైపులా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలి.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు



అనుమతులు లేకుండా పాఠశాల యాజమా న్యాలు స్కూల్ బస్సు లు నడిపితే కఠిన చర్య లు తీసుకుంటాం. స్కూల్ యాజమాన్యా లు వారి వాహనాలకు ఫిట్‌నెస్ చేయించు కోవాలి. అనుభవం ఉన్న వారిని డ్రైవర్‌గా నియమించుకోవాలి. నిబంధనలు పాటించ కుంటే కేసులు నమోదు చేస్తాం.

– అజయ్‌కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి

ఆర్జీయూకేటీలో అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న వర్సిటీ డైరెక్టర్, అధ్యాపకులు

భైంసా(ముధోల్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బాసర ఆర్జీయూకేటీలో అమ రవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టర్ సతీష్‌కుమా ర్, అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని అమరులకు ఘనంగా నివాళులర్పించారు.

ద్విచక్ర వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

భైంసాటౌన్(ముధోల్): వివిధ నేరాల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలకు (స్క్రాప్) భైంసాలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. జిల్లా ప్రొహి బిషన్, ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వ ర్యంలో వేలం నిర్వహించగా ఐదు బైక్‌లకు రూ.32వేల ఆదాయం సమకూరినట్లు భైంసా ఎక్సై జ్ సీఐ ఎండీ నజీర్‌హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్సైలు రమేశ్ గౌడ్, ప్రణీత్‌గౌడ్, కానిస్టే బుళ్లు పాల్గొన్నారు.

కప్పతల్లికి జలాభిషేకం



జలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పం టలు బాగా పండాలని, అందరికీ అన్నం పెట్టే రైత న్నలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆగ్రో ఎంప్లా యీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కప్పతల్లికి జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సింగర్ వార్ చంద్రశేఖర్, బాలాజీ, శ్రవణ్, దత్తు, గోపి, మోహన్, రమణ సంతోష్, తదితరు లు పాల్గొన్నారు.

'సమీకృతం'.. నిర్మాణంలో జాప్యం!



భైంసాలో కొనసాగుతున్న సమీకృత మార్కెట్ పనులు

- ఏడాదిన్నరగా కొనసా...గుతున్న పనులు
- జిల్లా కేంద్రంలో ఇప్పటికీ ప్రారంభంకాని వైనం

భైంసాటౌన్(ముధోల్): పట్టణాల్లో కూరగాయలు, మాంసం, చేపలు, పూలు, పండ్లు... ఇలా అన్ని మార్కెట్లు ఒకేచోట అందుబాటులో ఉండేలా ప్రభు త్వం సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణ యించింది. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రమైన నిర్మల్‌తో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో సమీకృత మార్కెట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రెండెకరాల స్థలంలో వెజ్, నాన్‌వెజ్, పూలు, పండ్ల దుకాణాలు ఒకే ఆవరణలో ఉండేలా నిర్మాణ పను లు చేపడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా భైం సా, ఖానాపూర్‌లో ఏడాదిన్నరగా పనులు కొన సా...గుతుండగా, నిర్మల్‌లో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇంజినీరింగ్ అధికారుల నిర్ల క్ష్యం, గుత్తేదారులకు సకాలంలో బిల్లులు అందక పనుల్లో జాప్యం నెలకొందనే విమర్శలున్నాయి.

ఎప్పటికి పూర్తయ్యేనో?

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల సమీకృత మార్కెట్ల నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతను పబ్లిక్‌హెల్త్ శాఖకు అప్పగించింది. వారు టెండర్లు పిలిచి, గుత్తేదారులతో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించారు. 2021లోనే స్థలాలు పరిశీలించగా నిర్మల్ మినహా భైంసా, ఖానాపూర్‌లలో స్థలాలు ఎంపిక చేసి పనులు సైతం ప్రారంభించారు. నిర్మల్ లో ఆర్టీసీ స్థలం పరిశీలించినా సంస్థ స్థలం ఇచ్చేం దుకు ఒప్పుకోకపోవడంతో మరోచోట పరిశీలిం చారు. భైంసా, ఖానాపూర్‌లో పనులు ప్రారంభిం చినా ఏడాదిలోపు పూర్తి చేయాలని నిబంధన లున్నాయి. దాదాపు ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ పనులు కొనసాగే దశలోనే ఉన్నాయి. అధికారులు దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



ఖానాపూర్‌లో సమీకృత మార్కెట్ పనులు

ఆగస్టు వరకు వినియోగంలోకి...

భైంసా, ఖానాపూర్‌లలో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏడాదిలోపు పూర్తి చేయా లని నిబంధనలున్నా.. త్వరితగతిన పూర్తయ్యే లా చర్యలు తీసుకుంటున్నాం. ఆగస్టు నెలాఖరు వరకు పనులు పూర్తయ్యేలా చూస్తాం. నిర్మల్‌లో పాత తహసీల్దార్ కార్యా లయం స్థలం పరిశీలించి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– హరిభువన్‌గౌడ్, పబ్లిక్ హెల్త్ ఏఈ

- నిర్మల్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సంస్థ స్థలం పరిశీలించగా వారు ఒప్పుకోలేదు. దీంతో అప్పటి నుంచి పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయం స్థలంలో మార్కెట్ నిర్మించాలని నిర్ణయించారు. రెండు, మూడురోజుల్లో పాత భవనం కూల్చివేసి పనులు ప్రారంభించను న్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే టెం డర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో రూ.7.20 కోట్లతో దాదాపు 140 దుకాణాలతో మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నారు.
- భైంసా పట్టణంలోని మిర్చి మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపడుతున్నారు. రూ.7.20 కోట్ల నిధులతో 90 (26నాన్‌వెజ్, 64వెజ్) దుకాణాలతో సముదాయం నిర్మిస్తు న్నారు. ఇక్కడ వెజ్ బ్లాక్ పనులు స్లాబ్ లెవల్ వరకు కాగా నాన్‌వెజ్ బ్లాక్ రూఫ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. ఆగస్టు నెలాఖరు వరకు పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.
- ఖానాపూర్‌లో రూ.3.90 కోట్లతో మార్కెట్ నిర్మా ణ పనులు చేపట్టగా దాదాపు 40 శాతానికిపైగా పూర్తయ్యాయి. 20 వెజ్, 20 నాన్‌వెజ్ దుకాణాలు నిర్మిస్తుండగా రెండు రూఫ్ లెవల్ వరకు పూర్తయ్యాయి.

అమరుల త్యాగఫలమే నేటి తెలంగాణ



అమరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్



అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ వరుణ్ రెడ్డి
- ఘనంగా అమరుల సంస్మరణ దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమంలో ధైర్యంగా పోరాడి ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగఫల మే నేడు మనం సాధించుకున్న తెలంగాణ అని కలె క్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవా ల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ భవనంలో కలెక్టర్ అధ్యక్షతన అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముందుగా అమరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంత రం కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ సై ద్ధాంతిక ఆలోచనలు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్య మ నాయకత్వం, అమరుల త్యాగం తెలంగాణ చరి త్రలో ఎప్పటికీ మర్చిపోలేనివన్నారు. ఎమ్మెల్యే విఠ ల్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలనలో నీళ్లు, నిధులు, నియామకాల పంపిణీలో అన్యాయాలు ఎ దుర్కొన్న తెలంగాణ నేడు అస్తిత్వ పరిపాలనలో సు భిక్ష తెలంగాణగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. డా క్టర్ ఉప్పు కృష్ణంరాజు అమరుల త్యాగాలను స్మరి స్తూ పాడిన పాట సభికులను ఆకట్టుకుంది.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

నిర్మల్‌టౌన్: తెలంగాణ కోసం అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్స వాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని మున్సి పల్ కార్యాలయం ఎదుట గల అమరుల స్తూపానికి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు ఘనంగా నివా ళులర్పించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మాట్లా డుతూ ఎంతోమంది త్యాగధనుల ఫలితం తెలం గాణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రం థాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మున్సి పల్ కమిషనర్ సీవీఎన్ రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కౌన్సిలర్లు రామగోని తులసి సర్వాగౌడ్, గండ్రత్ రమణ, అడప పోశెట్టి, బిట్లింగ్ నవీన్, ముజాయిద్ చౌస్, మాజీ కౌన్సిలర్ ఆకోజి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు సన్మానం

జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శైలేందర్ (భైంసా), గం గాధర్ (లోకేశ్వరం), చిన్న నరసయ్య (లిం గాపూర్) కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం అతిథులు వారితో కలిసి అల్పాహారం చేశారు. ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా ధికారి రవీందర్‌రెడ్డి , జిల్లా వైద్యాధికారి ధన రాజ్ , డీపీఆర్వో తిరుమల, డీఆర్వో లోకే శ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

'దశాబ్ది' కాదు..దగా ఉత్సవాలు

- కాంగ్రెస్ నేత కూచాడి శ్రీహరిరావు
- జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాలు దశాబ్ది ఉత్సవాలు కాదని దగా ఉత్సవా లు అని ఉద్యమనేత, కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు దశాబ్ది ఉత్సవాలకు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధు లు వెచ్చిస్తూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో పార్టీ ప్రచార కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటన్నా రు. ఉత్సవాలతో ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి, నిరుద్యోగభృతి ఒక దగా అని, ఇలా అన్నివర్గాల ప్రజలను ముఖ్యమంత్రి దగా చేస్తున్నాడన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నెలరోజులు దాటినా ఇప్పటికీ ఖాతాల్లో డబ్బు లు జమ కాలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధం గా ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న కూచాడి శ్రీహరిరావు

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం జరిగిన పరీక్షల్లో జిల్లాలో 11 మంది విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారు. ఇచ్చోడలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏడుగురు, ఛత్రపతి డిగ్రీ కళాశాలలో నలుగురు డిబార్ అయినట్లు పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న దూడలు పట్టివేత


లారీలో ఉన్న దూడలు

తానూరు: మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న దూడల ఐచర్ వాహనాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 32 దూడలను ఐచర్ వాహనంలో నిజామాబాద్ జిల్లా షాటాపర్‌కు తరలిస్తున్నారని సమాచారం అందింది. మండలంలోని హిప్నెల్లి సమీపంలో లారీని తనిఖీ చేయగా 32 దూడలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీడ్రైవర్, క్లీనర్‌ను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. దూడల లారీని భైంసాలోని గోశాలకు తరలించామన్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

139 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం సంచులు

భైంసాటౌన్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. పట్టణంలోని రాహుల్‌నగర్‌లో గల ఎన్ఎస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఓ గోదాంలో 117.65 క్వింటాళ్లు, నిర్మల్ రోడ్‌లోని పార్డి బైపాస్ రోడ్ సమీపంలోని ఓ దుకాణంలో 22.05 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. బియ్యం నిల్వ ఉంచిన అబ్దుల్ రహమత్‌పై కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ ప్రయాణం..పాస్



మంచిర్యాల బస్‌పాసు కౌంటర్

- విద్యార్థులకు ఉచిత పాస్‌ల పంపిణీకి ఆర్టీసీ ఏర్పాట్లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- కళాశాల, పాఠశాల విద్యార్థులకు తప్పనున్న ఇక్కట్లు

బస్‌పాసుల చార్జీల వివరాలు

కి.మీ	నెలకు	మూడునెలలకు
5	రూ.150	రూ.400
10	రూ.250	రూ.680
15	రూ.300	రూ.900
20	రూ.400	రూ.1150
25	రూ.450	రూ.1350
30	రూ.500	రూ.1500
35	రూ.550	రూ.1600

మంచిర్యాలఅర్బన్: ఈనెల 12 నుంచి పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయి. దూరప్రాంతాల నుంచి కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తప్పటం లేదు. పాస్‌లు పొందితే బస్సులు ప్రారంభించేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది. విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు నిత్యం వచ్చివెళ్లేందుకు బస్‌పాస్‌లు అవసరంతో ఉచిత రాయితీ పాస్‌లు అందించేందుకు ఆర్టీసీ అన్ని ఏర్పాట్లుచేసింది.

ఉచిత పాసులు ఇలా..
గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పల్లె వెలుగు బస్సుల్లో 12 ఏళ్ల లోపు(బాలురు) విద్యార్థులంతా 20 కి.మీ దూరం వరకు పాఠశాలకు వెళ్లిరావడానికి రోజు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిస్తున్నారు. పదో తరగతి వరకు చదువుకునే బాలికల కోసం ప్రయాణానికి అనుమతిస్తున్నారు. ఆర్టీసీ పాస్‌కోసం ఇంట్లో నుంచి పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. పైసా ఖర్చులేకుండా వెబ్‌సైట్‌లో అడిగిన వివరాలు పొందుపర్చి ఫొటో అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. www.online.tsrtcpass. in వెబ్‌సైట్‌లో రిజిష్టర్ అయితే నమోదు సంఖ్య వస్తుంది. దాన్ని పాస్ కౌంటర్‌లోని సిబ్బందికి తెలియజేస్తే బస్‌పాస్ పొందవచ్చు. తప్పనిసరిగా ఆయా విద్యాసంస్థలు అంగీకరిస్తేనే పాస్ జారీ అవుతుంది. నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఏడాదికి రూ.50 చెల్లిస్తే బస్‌పాస్ అందిస్తారు.

35 కి.మీ లోపు రాయితీ పాసులు
మంత్లీ స్టూడెంట్ బస్‌పాస్ రాయితీ కూడిన విద్యార్థులు చార్జీలు కేటాయించారు. ప్రైవేట్ పాఠశాలల్లోని 12 ఏళ్లు పైబడిన బాలురతోపాటు కళాశాలల విద్యార్థులు ఆర్టీసీ రాయితీ పాస్‌లు పొందవచ్చు. 35 కి.మీ మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉన్నా బస్‌పాస్‌లకు కి.మీ చొప్పున చార్జీలు వసూలు చేస్తారు. గుర్తింపుకార్డు కోసం అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. 12 ఏళ్లలోపు బాలురు ఉచిత బస్‌పాస్ ధర రూ.30, 18 ఏళ్లలోపు బాలికలకు ధర రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. పాస్ ఏడాదిపాటు చెల్లుబాటు అవుతుంది.

ఎంతో ప్రయోజనం..
తమ విద్యార్థులకు బస్‌పాసులు మంజూరు చేయాలంటే ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్టీసీ పేరిట డీడీలు రూపంలో నగదు చెల్లించాల్సి ఉంది. ఆర్టీసీ ప్రత్యేకంగా యూజర్ నేమ్ పాస్‌వర్డ్ కేటాయిస్తుంది. తమ పాఠశాలల్లోని 12 ఏళ్లలోపు బాలురు, పదోతరగతి వరకు బాలికలు ఉచిత పాసులు పొందాలన్నా ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్టీసీకి నగదు చెల్లించాల్సి ఉంటుంది. అకౌంట్స్ ఆఫీసర్ టీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ పేరిట డీడీలను తీసి సమీపంలోని డిపోల్లో అందజేయాల్సి ఉంటుంది. 200 మంది లోపు విద్యార్థులున్నా పాత, కొత్త ప్రైవేట్ పాఠశాలలు రూ.700, 500లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు రూ.1000, 500 మంది పైన విద్యార్థులున్నా పాఠశాలలు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు (రెన్యూవల్) రూ.1500, అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు (ఫ్రెష్) కింద రూ.2వేలు చెల్లించాలి. డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు రూ.6వేలు (కొత్తవి), రెన్యూవల్ కోసం రూ.5వేలు చెల్లించాలి. జూనియర్, డిప్లొమా, ఒకేషనల్ యాజమాన్యాలు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు కింద రూ.5వేలు, రెన్యూవల్ కోసం రూ.4 వేలు చెల్లించాలి.

ప్రైవేట్ విద్యాసంస్థలు డీడీలు చెల్లించాలి
విద్యార్థులకు ఉచిత పాస్‌లే కాకుండా రూట్‌పాస్‌లు కూడా జారీ చేస్తారు. బస్‌పాసులు పొందడానికి విద్యాసంస్థలు అడ్మినిస్ట్రేటివ్ రుసుము చెల్లించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు దీని నుంచి మినహాయింపు ఉండగా ప్రైవేట్ సంస్థలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. విద్యాసంస్థను బట్టి వార్షిక రుసుము నిర్దేశించారు. రుసుము చెల్లించి అనుమతి పొందిన వారికే ఆర్టీసీ ఆన్‌లైన్‌లో చోటు లభిస్తోంది. దీని ఆధారంగా విద్యార్థులకు రాయితీ బస్‌పాస్‌ల జారీ కొనసాగనుంది. 3 నెలలు, 6నెలలు ఇలా కాలపరిమితి కూడిన బస్‌పాస్‌లు కిలోమీటర్ బట్టి రాయితీతో పొందవచ్చు.

విద్యార్థులకు ప్రయోజనం..
ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం. అంతకుమించి ప్రయాణ సౌకర్యం విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్టీసీ పేరిట డీడీలు చెల్లించాలి. విద్యార్థులకు బస్‌పాసులు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సౌకర్యార్థం బస్‌స్టేషన్‌లో బస్‌పాసు కౌంటర్ ఏర్పాటు చేశాం. వివరాలకు 9985445438లో సంప్రదించవచ్చు.
– రవీంద్రనాథ్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

రాష్ట్రాన్ని దగా చేస్తున్న కేసీఆర్

- కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్


కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను దగా చేస్తున్నారని కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ ఆరోపించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాల దగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలు దొందూ దొందేనని అన్నారు. అధికార పార్టీ నేతలు దిష్టిబొమ్మ దహనాలను ఎన్నిసార్లు చేపట్టినా అడ్డుకోని పోలీసులు ప్రతిపక్ష పార్టీలను పదేపదే అడ్డుకుని ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛను కాలరాస్తున్నారని అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ ఫ్లెక్సీలను పోలీసులు పలుమార్లు లాక్కెళ్లి అడ్డుకున్నా నాయకులు ఒకేచోట గుమ్మిగూడి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, పెందూర్ ప్రభాకర్, నిమ్మల రమేశ్, జాదవ్ సునీల్, సతీశ్‌రెడ్డి, కడార్ల గంగనర్సయ్య, పుర్క బాపురావు, తోట సత్యం, మడిగెల గంగాధర్, వెంకట్రావు, వాజిద్‌ఖాన్, రాజునాయక్, భూషన్, రమేశ్, స్వప్నిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు


గుడుంబా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

- నలుగురిపై కేసు

పెంబి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎక్సైజ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇటిక్యాత్ తండా గ్రామానికి చెందిన గుగ్లావత్ లలిత వద్ద నిషేధిత గుడుంబా 5 లీటర్లు, పెంబితండాకు చెందిన రాథోడ్ మోతీసింగ్ గుడుంబా తయారు చేస్తుండగా బట్టీ ధ్వంసం చేశారు. అదే గ్రామానికి చెందిన అజ్మీరా రాజేశ్వరి గుడుంబా అమ్ముతుండగా పట్టుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు రాథోడ్ మోతీసింగ్, అజ్మీరా రాజేశ్వరిని స్థానిక తహసీల్దార్ శ్రీ.దర్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అనంతరం పెంబి తండాలో నిషేధిత గుడుంబాతో కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బంది నరేందర్, రషీద్, గౌతం, వెంకటేశ్, కల్పన ఉన్నారు.

కాపర్‌వైరు చోరీ నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

మామడ: ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ కేసులో మండల కేంద్రానికి చెందిన రాపని ఎల్లయ్యను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. రాపని ఎల్లయ్య 2017 నుంచి వరంగల్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఆరేళ్ల నుంచి ప్రతి ఆరు నెలలకోసారి పెరోల్‌పై 30 రోజులు ఇంటికి వచ్చి జైలుకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైరు చోరీ చేస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న పాత నేరస్తులు మహారాష్ట్రకు చెందిన ఫఖర్ గోరే, నిజామాబాద్‌కు చెందిన బాబురావు దండేల్వార్‌తో కలిసి కడెం, సోన్, లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్, మామడ మండలంలోని లింగాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీ చేస్తున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక సాయంతో వలపన్ని నిందితుడు ఎల్లయ్యను పట్టుకున్నారు. చోరీ కోసం వినియోగించిన రింగు పానలు, సెల్‌ఫోన్, కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో ఫఖర్ గోరేను గత వారం అరెస్ట్ చేయగా, మరో నిందితుడు బాబూరావ్ దండేల్వార్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం లక్కీ క్రికెట్ అకాడమీలో నిర్మల్ జిల్లా అండర్–19 జట్టు ఎంపిక చేసినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి, నిర్మల్ జిల్లా జట్టు రామరాజు, లక్కీ క్రికెట్ అకాడమీ ఇన్‌చార్జి సుదర్శన్, టీసీఏ సభ్యులు మణికంఠ తెలిపారు. మహేష్, విష్ణు తేజ, అల్మాస్, చరణ్, నితిన్, హరీశ్, సల్మాన్, రాము, సాయికుమార్, భీమ్ సింగ్, సైఫ్, అవాయిస్, ఇమ్రాన్, రమేశ్, దినేశ్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైనవారు వచ్చే నెలలో నిర్మల్‌లో ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

దాడి చేసిన ఇద్దరు యువకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన విఠల్‌పై దాడి చేసిన ఇద్దరు ఇర్ఫాన్, ధనీష్‌పై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని దుర్గా ట్రేడర్స్‌లో పనిచేసే విఠల్ బుధవారం రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో పెట్రోల్ కోసం తిర్పెల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లాడు. అదేక్రమంలో మహాలక్ష్మివాడకు చెందిన ఇర్ఫాన్, ధనీష్‌లు కూడా పెట్రోల్ కోసం వచ్చారు. వీరిద్దరు బంక్‌లో పనిచేసే యువకుడిని ఉద్దెరకు పెట్రోల్ పోయాలని కోరగా విఠల్, చిరుద్యోగితో మీరు అలా అనడం సరికాదని అడ్డుపడతారు. ఆగ్రహించిన సదరు యువకులు విఠల్‌పై దాడి చేసి విచక్షణరహితంగా చితకబాదారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటిపై దాడిచేసి..
ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్‌కాలనీకి చెందిన పసుల రాజమణి ఇంటిపై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజమణి బంధువులు మౌనిక, విజయ, శంకర్, ప్రియదర్శినిలు బుధవారం ఆమె ఇంటికెళ్లి కిటీకలతోపాటు తలుపు ధ్వంసం చేశారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. మౌనిక భర్త సాయికృష్ణ గత కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. తన భర్త రాజమణి ఇంట్లో ఉన్నాడమే అనే ఉద్దేశంతో ఆమె తన బంధువులతో కలిసి వెళ్లింది. ఈ క్రమంలో వారి మధ్య గొడవకు దారితీసింది. రాజమణి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తపాలాకు సాంకేతిక సొబగులు

- అందుబాటులోకి పోస్ట్ ఇన్ఫో యాప్
- వినియోగదారులకు సేవలు


నేరడిగొండ ఉప తపాలా కార్యాలయం

నేరడిగొండ: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుంటూ ఆధునికతను అందిపుచ్చుకునే దిశగా తపాలా శాఖ అడుగులు వేస్తోంది. అన్ని రంగాలతో సమానంగా ఆన్‌లైన్ విధానంలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపిస్తోంది. ఇప్పటికే పలుసేవలను ఆన్‌లైన్ విధానంలోకి తెచ్చింది. వీటితోపాటు తాజాగా 'పోస్ట్ ఇన్ఫో యాప్'ను తీసుకువచ్చింది. దీనిద్వారా పోస్టల్‌కు సంబంధించిన సమాచారాన్ని ఫోన్‌లోనే తెలుసుకునే వీలు కలిగింది.

వినియోగదారుడికి సదుపాయంగా..
పోస్ట్ ఇన్ఫో యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో తపాలా చార్జీలు, బీమా ప్రీమియం, వివిధ డిపాజిట్లపై వడ్డీ లెక్కించుకునే సదుపాయాలు సైతం ఉన్నాయి. సుకన్య సమృద్ధి యోజన, డిపాజిట్ పథకం, టైమ్ డిపాజిట్లపై ఏడాది నుంచి ఐదేళ్ల వరకు వచ్చే ఆదాయం వాటిని లెక్కించుకోవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీ రేట్లు ఆధారంగా పథకాలు ఎంచుకొని డిపాజిట్లు చేయడం ద్వారా వచ్చే ఆదాయం వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. దీంతోపాటు అమలులో ఉన్న (ఆరు అంకెల) పిన్‌కోడ్ నంబర్లను ఎంటర్ చేస్తే తపాలా కార్యాలయం పేరు, డివిజన్ పరిధి తెలియజేస్తుంది. తపాలా అందిస్తున్న సేవలపై ఖాతాదారులు ఫీడ్ బ్యాక్ ఇవ్వవచ్చు. ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం సైతం ఉంది.

కూర్చున్న చోటు నుంచే.
ఈ యాప్ ద్వారా కూర్చున్న చోటు నుంచే వినియోగదారులు సులువుగా సమాచారం పొందవచ్చు. తపాలా చార్జీలు, బీమా ప్రీమియం, పొదుపు పథకాల గురించి తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్ ద్వారా మరింత సులువు..

తపాలా శాఖలో బ్యాంకులకు దీటుగా ఆన్‌లైన్ ద్వారా సేవలందిస్తోంది. మహిళలకు ప్రత్యేక పథకాలు ఉన్నాయి. మా శాఖ ద్వారా ఆయా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఏవైన వివరాలు ఉంటే ఆయా గ్రామాల్లో గల తపాలా శాఖ కార్యాలయంలో కాని, బీపీఎంల ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు.
– మహేశ్‌రెడ్డి, సబ్ పోస్టుమాస్టర్, నేరడిగొండ

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


సాయికిరణ్ (ఫైల్)

తాంసి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలం వడూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పందేం సాయికిరణ్(18) పదో తరగతి వరకు చదువుకున్నాడు. గ్రామంలో తండ్రికి ఉన్న కిరాణషాపు ఉంది. ఆయనకు చేదోడువాదోడుగా ఉన్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి సాయికిరణ్ మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించి రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహన్ని భీంపూర్ ఎస్సై రాధిక పరిశీలించి పంచనామా నిర్వహించారు. తండ్రి సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో ఆంధ్రపదేశ్ రాష్ట్రానికి చెందిన యువకుడి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కావలి గ్రామానికి చెందిన ముద్దు సాయికుమార్ (19) రెండేళ్ల క్రితం మేస్త్రీ పనిచేయడానికి పుస్పూర్ గ్రామానికి వలసవచ్చాడు. చిన్నప్పుడే అతడి తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ, నాకు ఎవరూ లేరని నేను అనాథనని ఎప్పుడు బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో గురువారం పుస్పూర్‌లోని పశువుల షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి వరుసకు అన్న గొల్ల ప్రేమ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన పోతురాజు లింగన్న(57) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..లింగన్న కొన్నేళ్ల క్రితం విదేశాల నుంచి తిరిగివచ్చాడు. మళ్లీ వెళ్లలేకపోవడంతో మనస్తాపం చెంది ఈనెల 20న వ్యవసాయ పని నిమిత్తం వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుమారుడు నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐచర్‌డ్రైవర్ మృతి

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ వద్ద జాతీయ రహదారి 44పై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఐచర్ వాహనం మన్నూర్ వద్ద నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఐచర్ డ్రైవర్ సరప భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్సులో రిమ్స్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు మెదక్ జిల్లా నిజాంపేట వాసి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆటో బోల్తా

- వృద్ధుడికి తీవ్రగాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలో గురువారం ఆటో బోల్తా పడిన ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది గ్రామానికి ఆటో వెళ్తోంది. మావల సమీపంలోని నలందా కాలేజీ వద్ద ఓ బైక్ అడ్డు రావడంతో బోల్తా పడింది. సీతాగొందికి చెందిన వృద్ధుడు సర్పే మల్లాజికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అతని వద్ద రూ.లక్షా 11వేల 500 పోగొట్టుకున్నాడు. స్థానికంగా ఉన్న రాజేష్ ఆయన డబ్బులు తీసుకుని రిమ్స్‌కు చేరుకున్నాడు. బాధితుడి వివరాలు తెలుసుకుని రిమ్స్ ఔట్‌పోస్ట్‌లోని పోలీసులు భూమన్న, రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధుడి కుమారుడికి నగదు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. కాగా, ప్రమాదంలో గాయపడిన మల్లాజి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

సిరికొండ: మండలంలోని ఫకీర్‌నాయక్ తండా గ్రామానికి చెందిన జాదవ్ అరవింద్(25) అదృశ్యమయ్యారు. ఎస్సై నీరేష్ కథనం ప్రకారం.. జాదవ్ అరవింద్ తాగుడుకు బానిసయ్యాడు. ఎలాంటి పని లేకుండా తిరుగుతుండడంతో భార్య అనూష మందలించింది. గత వారం నుంచి ఇంటి నుంచి వెళ్లిన జాదవ్ అరవింద్ తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. భార్య అనూష ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు


నర్సింలు(ఫైల్)

తానూరు: మండల కేంద్రానికి చెందిన బొందోళ్ల నర్సింలు (48) కనిపించకపోవడంతో గురువారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. నర్సింలు గత కొన్నేళ్లుగా మేస్త్రీ పనులు చేసుకునేవాడు. ఈ నెల 15న ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి ఇప్పటికి రాలేదు. ఆచూకీ కోసం ఎంత వెతికినా కనిపించకపోవడంతో భార్య సునీత ఫిర్యాదుతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ధర్మసాగర్ చెరువు కట్ట సమీపంలో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ పురుషోత్తం తెలిపారు.